# భూమిక

-డా॥ దేవరాజు మహారాజు

తెలంగాణా సాయుధ పోరాటం ఉధృతంగా సాగుతున్న రోజులు - నిజాం సిపాయిలు ఊళ్ళ మీద పడి, దోచుకుంటున్న రోజులు. కోళ్ళని, గొర్రెల్ని కోసుకుతిని, కనబడ్డ ఆడదాన్నల్లా చెరిచి, ఖుషీ చేస్తున్న రోజులు.

ప్రపంచానికి చీకటి - పాలు ఇస్తున్న రోజులు!

ప్రపంచాన్నే చీకటి పాలిస్తున్న రోజులు!!

చీకటి రాజ్యంలో అతి భయంకర కంఠస్వరాల ఉరుములు. హీనుల బలహీనుల రోదనలు. అందమైన ఆడవాళ్ళ గళాలలో ఆర్తనాదపు జీరలు. లోకుల్ని కాల్చుకు తింటున్న తుపాకులు. సైనిక పిశాచాలు...

వీధుల్లో వాహనాలు తిరగడం లేదు. క్రిమికీటకాలు సైతం బయటికి రావడానికి భయపడుతున్నాయి. చీమల బారుల్లా సైనికులు నగరాన్నంతా దోచేస్తున్నారు. క్రూరత్వంతో ముంచేస్తున్నారు. డబ్బూ, విలువైన వస్తువులు, ప్రాణాలు, స్త్రీల మానాలు, అందాలు, ఆనందాలు, పూల పుప్పొడితనం, ముళ్ళ వాడితనం.. కలిసికట్టుగా దోపిడి చేయబడుతున్నాయి. గాయాలు తగిలిన వారు రక్తం కారుతూ ఉండగా, పరుగెత్తుతున్నారు. వాళ్ళను మళ్ళీ వాళ్ళ రక్తపు అడుగులే పట్టిస్తున్నాయి. ఊపిర్లు పగిలిపోతున్నాయి. రోడ్ల మీద ఎన్నో శవాలు! వాటిపైనుండే పోలీసు వ్యాన్లు. మట్టి, మాంసం, రక్తం అంతా కలిసి బురద బురద..

తెలంగాణా అంతటా నిజాం వ్యతిరేకోద్యమం బలం పుంజుకుంది. విముక్తి ప్రజాసైన్యం మరింత చైతన్యవంతమైంది. హైదరాబాదు మహానగరంలో గన్‌ఫౌండ్రి వద్ద, నిజాం వెళుతున్న కారుపై ఎవరో బాంబు విసిరేశారు. నిజాంకు ప్రమాదం కొద్దిలో తప్పింది. బాంబు విసిరేసిన వారెవరో వెంటనే దొరకలేదు. ఆ సంఘటనతో నగరమంతా అట్టుడికి పోయింది. బందోబస్తు ఎక్కువైంది.

ఆ పెద్ద బంగళాలో ప్రముఖ నటి శ్యామల ఒంటరిది. ఆందోళనల మధ్య, ఆవేశాల మధ్య ప్రాణం కొట్టుకులాడుతుండగా ఆమె నిస్సహాయంగా ఉంది. ఆ పెద్ద బంగళాలో ఆమెది మరీ పెద్ద గది. పూర్తి ప్రశాంతంగా ఉండేది. నీలిరంగు బల్బు వెదజల్లే వెలుగులో చల్లదనం ఉందనిపించేది. సీలింగ్ ఫ్యాన్ మెల్లిగా తిరుగుతూ హాయినిచ్చేది. కాని ఆ రాత్రి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. బయట తుపాకి దెబ్బలకూ, ఆక్రోశాలకు మధ్య స్వైరవిహారం చేస్తున్న నిశ్శబ్దంలో శ్యామలకు పిచ్చెక్కినట్లయ్యింది. ఆమెకు వచ్చిన అవార్డ్సూ, మెడల్సూ, ముఖ్యమైన వాళ్ళు కలిసినపుడు వారితో తీయించుకున్న ఫొటోలు అన్నీ చూసుకుంది. వాటితో ఇక రుణం తీరినట్టే - ఆమె శ్వాస - ఆమెకు ఎన్నో బహుమతులు ఇచ్చింది. ముఖ్యంగా 'ప్రముఖ నటి' అన్న గుర్తింపు నిచ్చింది. మరి రాబోయే మృత్యువు ఏమిస్తుంది? జీవితానికి ఫుల్‌స్టాప్ పెడుతుంది. ప్రేక్షకులకు ఆమెను గుర్చిన జ్ఞాపకాలను పంచుతుంది. మంచి చెడ్డల్ని ఎంచుతుంది.

ఆమె కూతురు అరుణ. తను కేవలం రంగస్థల నటి, బిజీ స్టార్ మాత్రమే కాకుండా, ప్రముఖ సర్జన్ డాక్టర్ కె.రామారావుతో హాయిగా సంసారం వెళ్ళబుచ్చుతున్నానని రుజువు చేయడానికి పుట్టింది. ఆ చిన్న పిల్ల అప్పుడప్పుడు ఏడుస్తుంది. తల్లి ఒంటరితనాన్ని పోగొట్టడానికి! మాతృత్వాన్ని తాగడానికి!! భర్త కూడా ఆ సమయంలో వెంట లేకపోవడం ఆమె ఒంటరితనానికి విషమ పరీక్ష అయ్యింది. మెయిన్ డోర్ ఎవరో బాదుతున్నారు. దబదబ శబ్దం గుండెలో చావు డప్పులా ఉంది! గుండెలో మసలిన రక్తం మెదడు కెక్కుతోంది. మెదడంతా అయోమయంగా ఉంది. నౌకర్లు, చాకర్లు అందరూ ఎవరెవరు ఎక్కడికి పారిపోయారో తెలియదు. ఎంత చెప్పినా సమయానికి ఒక్కరూ లేరు. చెమటలూ... భయం - భయంకరమైన రాత్రిలో ప్రమాదకరమైన పరిస్థితుల్లో తను ఒంటరిగా చిక్కుకు పోయినట్లు అనిపించింది ఆమెకు. తలుపు బాదడం ఎక్కువైంది.

'ఎవరు' - అని అడిగే ధైర్యం కూడా లేదు -

"ఏయ్ దర్వాజా ఖోల్" - బజారంతా దద్దరిల్లేట్లు క్రూరమైన నవ్వు వినిపించింది. విరిగిపోయేంతగా తలుపుల్ని తన్నుతున్న చప్పుడు... ఇక లాభం లేదు. ఇత్తెహాదుల్ గుండాలు ఇంట్లో జొరబడి, అల్లరిపెట్టి, చివరకు చంపేస్తారు. రోజూ 'మీజాన్' పత్రికలో చదివే వార్తలకే భయపడిపోయేదామె. ఇప్పుడిక ఎదుర్కోవాలంటే ఎంత ధైర్యం కావాలి? భయపడుతూనే తలుపు తీసింది. చనిపోతానని అనుకునే తలుపు తీసింది-

ఖాసిం నిలబడి ఉన్నాడు.

అతని వెంట చాలామంది జవాన్లున్నారు. వారి దగ్గర తుపాకులు, బ్రెన్ గన్‌లూ ఉన్నాయి. అందరూ లోనికొచ్చారు. సారా కంపు గుప్పున ఇల్లంతా వ్యాపించింది. వైభవంగా ఉన్న ఇల్లు, ఖరీదైన వస్తువులు చూసి, జవాన్లు నిగ్రహించుకోలేకపోతున్నారు. లూట్ చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. ద్రాక్షపళ్ళకు ఆశపడ్డ నక్కల్లా - కాని తమ సర్దార్ హుకుం జారీచెయ్యందే వారేమీ చెయ్యరు. వారిని, వారి మనసుల్నీ ఏమాత్రం చదవడం లేదు - ఖాసిం. అతని దృష్టి అంతా శ్యామల మీదే ఉంది. అతడు ఊహించనంత అందం ఆమెలో కనిపించింది. ఆ వాతావరణం చూడగానే సర్దార్‌కు కొంచెం విశ్రాంతి తీసుకోవాలనిపించింది. దోపిడీలు, ఖూనీలు విరామమెరుగక చేయడం వల్ల శరీరం అలసిపోయింది. మనసు మెత్తబడింది. చెయ్యాల్సిన పని కాసేపు సరదాగా ఆడుకుని, మరీ చెయ్యొచ్చునన్న ఆలోచన కలిగింది.

"సుభానల్లా! ఏమి అదృష్టం నాది..." ఆమెలోకి చూపుల్ని గుచ్చుతూ అన్నాడు. అరనిమిషం గడిచింది. ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా 'హుస్సేన్'- అని కేకేశాడు. గుంపులో నుండి ఒకతను ముందుకు వచ్చి శాల్యూట్ చేశాడు.

"నాచ్‌నే వాలీ ఔరత్ యహీ హై క్యా?"

"జీ. హాc. నర్తకి కాదు సాబ్, గొప్ప నటి! ఈమె పెనిమిటి ఈ దేశంలో లేదు. విలాయత్ పోయిండు."

"ఉంటే ఏముంది? పోతే ఏముంది? మాకు మాత్రం బాగా ఉంది" రసికతతో అన్నాననుకున్నాడు ఖాసిం. శ్యామల తెలివిగలది. పైగా మంచి నటి. అతనిలోని బలహీనతను పసిగట్టింది. దానితోనే అతణ్ణి కట్టిపడేయాలనుకుంది. ఆమెలోని కళాకారిణి మేల్కొంది. భయపడుతున్నట్లు ఏమాత్రం కనిపించలేదు.

"తుమ్ లోగ్ జావ్. ఫిర్ కాంప్ మె మిలేంగే. వీళ్ళందర్నీ మన జాగకు తీస్క పో - కహీ భీ పాగల్ పన్ నై కర్‌నా" చండశాసనుడు గర్జించాడు.

"అచ్చా సాబ్" శాల్యూట్ చేశాడు హుస్సేన్. తదనుగుణంగా మిగతా సిపాయిలూ చేశారు. అందరూ వెళ్ళిపోయారు. వీధి గుమ్మం తలుపేసి, గడి వేసి తిరిగొచ్చాడు ఖాసిం.

ఆమె చిన్నగా నవ్వింది. అక్కడతనికి స్వర్గం కనిపించింది. ఒకసారి ఆమెను గట్టిగా ముద్దు పెట్టుకోవాలనుకున్నాడు. ఆమె వైపు వంగాడు "ఓ.. నో... డోంట్!" - అంటూ గొణగలేదు- ఆమె. మారాం చేయలేదు. పౌంటేన్ నీటిని పైకి ఎగజిమ్మినట్టు పదాల్ని బరువుగా మత్తుగా చిలికింది. ఆమె కలికి తనం పలికింది. పరవశుడయ్యాడు - సర్దార్. "నువ్వు జింకవు" - అంటూ ఉరుదూలో ఏదో అనబోయాడు. "నీకు శాన బింకము" - అన్నాడు.

ఆమె - మల్లె మొగ్గలా నవ్వింది.

"నీ.. పేరు.. ఏమి?" మీసాలు మెలేస్తూ అడిగాడు. ఆమె సోగకళ్ళు మరింత అందంగా తిప్పి, బుగ్గమీద చక్కని చొట్ట పడ్డప్పుడు అంది "షబాబ్"

"షబాబ్?" - ఆశ్చర్యపడ్డాడు. "తెలుగులో మీకు అర్థం కాదుగదా? అందుకే... ఉర్దూలో నా పేరుకు అర్థం అదే అనుకుంటాను.." - ఆమెకు తెలుసు. ఆమె అబద్ధం చెబుతోందని. అబద్ధాలతోనే అతణ్ణి నమ్మించాలని-

"ఒహో - షరాబీ - మాంఛి పేరు" - ఆమెకేదో ఆలోచన వచ్చింది.

"మీకు షరాబ్ ఇష్టమా?" - అని అడిగింది.

"హాc- అవును. నువ్వెంత ఇష్టమో - అంత!!"

"క్షమించండి. పాప లేచింది. ఇప్పుడే పడుకోబెట్టి ఐదు నిముషాల్లో వస్తా. అంతలోకి మీరు విశ్రాంతి తీసుకోండి. తర్వాత నేను మీకూ..." మాట పూర్తి కాకుండానే సంతోషంతో నవ్వాడు ఖాసిం.

"అదిగో షల్ఫ్‌లో బ్రాందీ బాటిల్స్ ఉన్నాయి. ఈ పక్కనే ఫ్రిజ్ డేర్‌లో బీర్, కోల్డ్ వాటర్ ఉన్నాయి. విస్కీ కూడా ఉంది. ఎంజాయ్ ద డ్రింక్స్" - మహదానందమైంది అతనికి. కోరిక చెలరేగింది. ఒక్కసారిగా కావల్సిన బాటిల్స్ అన్నీ తీసుకుని, సోఫాలో కూలబడి ముందుంచుకున్నాడు.

"జల్దీ రావాలె. నీకు ఏమి ఖత్‌రాలేదు. కొంచెం ఖుషీ చేసి పోతాం అంతే-" సరేనన్నట్లు మెల్లగా తల కదిలించి, గమ్మత్తుగా కళ్ళు మూసి, తెరచి, నిశ్శబ్దంగా నవ్వి... అక్కడి నుండి గబగబా లోనికెళ్ళిపోయింది. అతని చూపులు ఆమెనే అంటుకున్నాయి. చిలిపిగా నవ్వుకున్నాడు.

రిఫ్రిజిరేటర్లో కావల్సినవన్నీ ఉన్నాయి. గబగబా రెండు పెగ్‌లు తాగి, సిగరెట్ అంటిస్తే చాలా హాయిగా, ప్రశాంతంగా అనిపించింది - మనసుకు. మధ్యలో ఓసారి శ్యామల హాల్లోకి వచ్చి ఏదో తీసుకెళ్ళింది. అతనికి అది అనవసరం. ఆమె నవ్వింది - అంతే - మరో పెగ్ ఆమె వైపు ఎత్తి, మళ్ళీ తాగాడు. మత్తు కళ్ళను కమ్ము

తోంది. చుట్టూ గోడలకు ఉన్న పెయింటింగ్స్ ఏవి ఏవో తెలియడం లేదు. ఒకటి మాత్రం శ్యామల ఆమె భర్తతో కలిసి, పెళ్ళయిన కొత్తలో తీయించుకున్న ఫోటో ఉంది. అతనికి ఫొటో అంతా కనిపించడం లేదు. శ్యామలను గుర్తుపట్టాడు. ఆమె అతణ్ణి చూసి నవ్వుతున్నట్టు అనుభూతి చెందాడు. ఫొటోలోని శ్యామలకు చూయిస్తూ మరో పెగ్... తరువాత ఇంకో పెగ్ ఖాళీ చేశాడు. లేచి ఇల్లంతా తిరగాలనుకున్నాడు. కాని లేవలేకపోయాడు. అలా ఉంటేనే సుఖంగా ఉందనిపించింది. ఖాళీ సీసా సోఫా కిందికి జారింది.

తనకు ఇష్టమైన గజల్ ఏదో తడబాటు పదాలతో నోరు వంకరగా పెట్టి గొణుక్కున్నాడు. అతణ్ణి అవతలి గదిలో నుండి గమనిస్తూ వున్న శ్యామల "హమ్మయ్య" అని అనుకుంది. దగ్గరికి వెళ్ళి తల నిమిరింది. ముద్దు ముద్దుగా మాటలు చెప్పింది. యూనిఫాంలో వున్నా అతడి చొక్కా గుండీ ఒకటి తీసి ఛాతీ అంతా సుతారంగా రాసింది. మెల్లిగా మంచితనంతోనే 'మత్తు మందు - సెడటివ్' తాగించింది. పరస్త్రీ తనను అంత బాగా ఆదరించడం అప్పుడే చూశాడు. ఆ సంతోషంలో ఏదేదో వాగాడు. కాని ఆమెకు వినాల్సిన అవసరం లేదనిపించింది. కోరలూడదీసి, విషం లాగేసి, సర్పాన్ని పట్టుకున్నట్టు - విజయ గర్వంతో ఉప్పొంగిందామె.

అతను ఇంట్లోకి రాగానే ఎంత భయమైంది? ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు. ఆమెకు బాగా చేతనైన పని - నటన. దానితోనే మోసగించాలన్న ఆలోచన వచ్చింది. అట్లని నటిస్తున్నట్టు కూడా తెలియకూడదు! అంతలోనే భయమైంది. జీవితానికి నటనకు గల భేదం ఆ క్షణం బాగా అర్థమైంది. ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన భూమిక కళ్ళలో మెదిలింది. సైనికులు రాగానే అతిథుల్ని ఆహ్వానిస్తున్నట్లు చిరునవ్వు నవ్వింది. అంతే - ఆ నవ్వు భయంకరమైన అరుపుల్ని, బీభత్సాన్ని, దోపిడిని ఆపగలుగుతుందని ఊహించలేకపోయింది. కాని ఆత్మస్థైర్యంతో ప్రయత్నించి ఎదుర్కోవడం వల్ల, ఆమెకు ఎంతో సంతృప్తిగా ఉంది. ఖాసిం స్థితి పూర్తిగా విషమించింది. ఇచ్చిన డ్రగ్ పనిచేసింది. గొణుక్కోవడం కూడా మానేసి, సోఫాపై పడిపోయాడు. పగిలిన గ్లాసు గాజు ముక్కల్ని ఏరి పారేసి లేవలేని స్థితిలో వున్న ఖాసింను సోఫా నుండి మరో రూంలోకి నడిపించింది. అతణ్ణి అందులో వేసి గడియ వేసింది. హాయిగా ఊపిరి పీల్చుకుని, సోఫాలో కూలబడింది.

మళ్ళీ శబ్దమైంది - ఆమె అదిరి పడింది.

కాని ఆ చప్పుడు తలుపుది కాదు, గడియారానిది!

సమయం రాత్రి పన్నెండయ్యింది. వాతావరణం భయం భయంగా ఉంది. కొంతసేపు కూతురు అరుణను జోకొడుతూ గడిపింది. నిద్ర రావడం లేదు. ఆప్తాలమిక్ సర్జరీలో నైపుణ్యం సంపాదించడానికి ఇంగ్లండ్ వెళ్ళిన భర్త గురించి ఆలోచించింది. ఆయన క్షేమంగా తిరిగి రాగలడా? కలిసి మళ్ళీ ఒకచోట సుఖంగా బతకగలమా? అనుమానాలు తలెత్తాయి. పరిస్థితులు చక్కబడి మళ్ళీ తను నటించే అవకాశాలు వస్తాయా? ప్రేక్షకుల అభిమానం మళ్ళీ తనను ఉన్నత శిఖరాల మీద కూర్చోబెడుతుందా? ఇక్కడి వాళ్ళంతా ఆంధ్ర ప్రాంతానికి పోయి తలదాచుకుంటుంటే, తను అనవసరంగా ఇక్కడికొచ్చి ఇరుకున పడిందా? తనలో తనకే ఎన్నో ప్రశ్నలు.

నిరాశతో వీధిలోకి చూస్తూ గడిపింది. నిశ్శబ్దాన్ని ముక్కలు చేస్తున్నట్లు అప్పుడప్పుడు గుర్రపు డెక్కల చప్పుడు వినిపిస్తోంది. మళ్ళీ తలుపు బాదిన చప్పుడు... రెండు నిముషాలు గడిచాయి. ఈసారి ఎవరొచ్చారో, మళ్ళీ ఎలాంటి భూమిక ధరించాలో అర్థం కాలేదు. ఈసారి వచ్చిన వాళ్ళు తనను, తన బిడ్డను కాల్చెయ్యరని నమ్మకమేమిటి? కళ్ళలో 'భయం' నీళ్ళుగా మారింది. తలుపు చప్పుడు - తన ఓపికను, నటనా సామర్థ్యాన్ని పరీక్షించడానికే; తనను అధఃపాతాళానికి తొక్కేయడానికే అన్నట్లుంది. గుమ్మం దాకా వెళ్ళి నిలబడింది.

"తలుపు తెరవకుంటే ఇల్లు కాలిపోతుంది - జాగ్రత్త!" - ఉర్దూలో బెదిరింపు. బాధలు, భయాలు కలిసి ఆమె మరో కొత్త నవ్వు నవ్వుతూ తలుపు తెరిచింది. తలుపు తెరవగానే కనబడిన వాళ్ళను అమాంతం కొరికేద్దామనుకున్నాడు హుస్సేన్. కాని ఆమే తలుపు తెరచి నిలబడడంతో నిప్పుకు దగ్గరైన వెన్నలా కరిగిపొయ్యాడు. ఆమె తెల్లని శరీరం... ముఖం మీద పడుతున్న నల్లని వెంట్రుకలు, నిద్రకై వేచి వేచి వాచిపోయిన కళ్ళు; నున్నటి బుగ్గలు వింత అందాన్ని అందించాయి అతనికి.

అలాగే చూపుల్ని కిందికి జార్చి ఆగాడు.

"భలే నిద్ర పట్టేసింది" అంటూ ఆమె అనవసరంగా నవ్వింది. అతడు గబుక్కున లోనికొచ్చి తలుపు వేశాడు.

"ఒంటరిగా ఉన్నావని భయపడకు! అల్లా మియా మీద ఒట్టు. నీ ప్రాణం తీయను. బుద్ధిగా నేను చెప్పినట్లు చెయ్." ఆమె నవ్వు అస్త్రం ప్రయోగించింది. అతడు చిక్కున పడ్డాడు. ఆమె నవ్వులో గొప్ప ఆకర్షణ ఉంది.

"క్యా హుస్న్ హై... తెరీ" - తనలో తానే అనుకున్నాడు.

"గుమ్మం దగ్గరే షాయరీ చెప్పేస్తున్నారే - లోన హాల్లోకి రాకూడదా?" - అంది శ్యామల. తనదే పొరపాటయినట్లు ముఖం పెట్టి లోనికి నడిచాడు. ఆ గది దాటి లోన సోఫా దగ్గరి దాకా వచ్చాడు.

"డ్రింక్స్ రడీగా ఉన్నాయే"

"తాగుతారా తీసుకోండి"

"నై.. నై బహుత్ షుక్రియా - బస్ తుం..." మధ్యలో అర్థవంతంగా ఆగాడు.

"ఊఁ... మై?" - కళ్ళు వింతగా తిప్పిందామె.

"తుమ్‌కొ ఛీన్‌లూంగా సహీఁ"

తుఝ్ జైసా హీరా కహీఁ ఖజానామే నహీఁ-" పూర్తి కాకుండానే పకపకా నవ్వింది శ్యామల.

"అమ్మాయిల్ని వర్ణించడం మీకు బాగా వచ్చు"

"అమ్మాయిలను వర్ణించను. పెళ్ళయిన కొత్తలో ఐసేహీ"- అంటుండగానే కూర్చోమని చెయ్యి లాగి తన పక్కనే కూర్చోబెట్టుకుంది.

అతని చెయ్యి తన చేతుల్లోకి తీసుకుంది-

"అసలు విషయం పక్కనబెట్టి ఖాళీ మాటలకు దింపుతున్నవ్? చలో... చలో మెరా కామ్ జల్దీకరో - జానేక హై"

"అరె, ఆప్ క్యా ఇత్‌నా దర్‌తే హై. మీ ఆఫీసరు కూడా ఎవరింట్లోనో ఇలాగే దూరి ఉంటాడు."

"ఎవరింట్లోనో ఎందుకూ? నీ ఇంట్లోనే దూరి, మమ్ముల ఎల్లిపొమ్మన్నాడు సూడూ. ఆ ఎల్లిన వాల్లలో నేను భి ఉన్నా.. ఎల్లనైతే ఎల్లిన కాని, నా మనసు ఇక్కడే తన్‌లాడతా ఉంది. ఎంత హందగా ఉన్నవ్?" వచ్చి

## పుస్తకం

**అ**మ్మ అంటే చనుబాలుతీపి
చనుబాల తీపితో రంగరించి
నీ చుట్టూ వున్న ప్రపంచాన్ని ఉగ్గుపాలతో కరిగించి
తాపిస్తుంది
తప్పటడుగుల్లో నువు జారిపడి మోకాళ్ళు రక్తాలోడితే
పాలకడలై పొంగిపొర్లి రెండు కుంభాల మధ్య
గాఢంగా హత్తుకొని
రక్షణ కవచాన్నిచ్చి ప్రేమ రుచిమలామాను పూస్తుంది
ఆ చల్లని నీడలో పెరిగి పెద్దవాడైన మనిషి అమ్మనే
మర్చిపోయినట్లు
పుస్తకాన్ని మర్చిపోతే ఎలా?
అందుకే పుస్తకం హస్తభూషణం కాదు
సర్వకాల సర్వావస్థల్లో నీకు రక్షణ నిచ్చే నేస్తం, నీ
సమస్తం
అమ్మ నీ చిటికనవ్రేలు పట్టుకొని నిన్ను ఒడ్డుకు
చేర్చినట్లు
జీవితమనే అస్తవ్యస్తపు గతుకుల రస్తా మీద
ఎదురయ్యే
అడ్డంకుల్ని ఎదిరించే ధైర్యాన్నిచ్చే నీ భుజం తట్టి
ఆవలి ఒడ్డుకు
చేర్చేది పుస్తకమే!
అమ్మ ఒడిలోంచి తరగతి గదిదాటి
రెండో తరగతి గడప దాటి ఒక్కో మెట్టు ఎక్కుతూ
చదవాలి
అమ్మ ఆశలన్నీ నీపైనే!
చదివి చదివి అలసి సొమ్మసిల్లిపోతే
జీవితం నీ చేతికి చిక్కినట్టే చిక్కి జారిపోతూ
వుంటుంది
పట్టు చిక్కేంతవరకూ నీ చిటికిన వేలును వదలందీ
అమ్మే!
దాహం తీరదు!
జ్ఞానదాహం మళ్ళీ మళ్ళీ ప్రశ్నార్థకంగా నీ ముందు
ఒక ప్రశ్న అదృశ్యమయ్యేలోగా మరోప్రశ్న
జీవితం సంధించే అనేక ప్రశ్నలకు నీవే ఒక
ప్రశ్నార్థకం?
సత్యసోధనకు నిరంతరం సాధన తప్పదు
అలా అలవోగ్గా పుస్తకాన్ని అందుకొని గుండెలకు
హత్తుకో
ఒక్కొక్క పేజీనే తిప్పుతూ నీకు నచ్చిన సన్నివేశాన్ని
అరమోడ్పు కళ్ళతో అద్భుత ప్రపంచాన్ని ఊహించు
కలలు కనే కళ్ళల్లో కాంతిపుంజాలు విరుస్తాయి
జీవితం ప్రతి మలుపులో నిలబడి దిగంతాలకు
చాచిన హస్తాల్తో పుస్తకాన్నందుకో
కలలు కనటం మాత్రం మానొద్దు
కలలు ఏవైనా కలలే, కల్లలు కానంతవరకు కలలు
కను
పుస్తక ప్రపంచం ముందు వినమ్రంగా మోకరిల్లు
పుస్తక ప్రపంచం నీకు దశానిర్దేశమే కాదు
దిశానిర్దేశం కూడా చేస్తుంది
కలలు కనే ప్రపంచాన్ని సాకారం చేస్తూ జీవితాన్ని
అర్థవంతం చేస్తుంది.

**-డా॥ జూపల్లి ప్రేమ్‌చంద్**

రాని తెల్గూ; ఉర్దూలో కలిపి మాట్లాడుతున్నాడతను. ఒక్కోసారి ఉరుదూలో అతని మాటలు ధారాళంగా సాగుతున్నాయి. అతనికి గట్టిగా ఏదో చెయ్యాలని ఆరాటం. కాని ఆమెకై ఆమె చనువుగా దగ్గరికొస్తూ ఉంటే, బలవంతం చేయడం ఎలా? బుజ్జగిస్తున్నాడు. ఆమె నవ్వుతో వెలుగుతోంది. వెలుగులో అతను కీటకంలా కాలిపోతున్నాడు.

"యూ ఆర్ సో హాండ్సమ్" తీయగా అంది, సాగదీసి- ఆనందం పరిధులు దాటింది హుస్సేన్‌కు. మళ్ళీ అడిగింది-

"వయసు మళ్ళిన తర్వాత పెళ్ళి చేసుకున్నారా యేం?" ఆమె కూడా వీలయినంత వరకు ఉరుదూలోనే మాట్లాడుతోంది.

"అబ్బే లేదు. చేసుకుని ఇరవై అయిదేళ్ళయ్యింది... నా పిల్లలకు పిల్లలు కూడా అయ్యారు" బొలబొలా నవ్వాడు.

"మీ పిల్లలా? నా వయసు ఉంటుందా వాళ్ళకూ?"

"పెద్దది హసీనా - నీ వయసుండొచ్చు. చిన్నది షబానా నీకన్నా చాలా చిన్నదై ఉంటుంది"

"చాలా అందంగా ఉంటారా వాళ్ళు?" - అందంగా ముఖం తిప్పి అడిగింది.

"అవును" - చిరునవ్వు నవ్వాడు.

"అందగత్తెల జాబితాలోకే వస్తారు నీలాగా-" అన్నాడు. ఆమె కళ్ళు మూసుకుని, అతని భుజంపై చెయ్యివేసి మగతగా అడిగింది.

"మీకు, మీరు పుట్టిన ఊరన్నా. మీ కుటుంబమన్నా చాలా ఇష్టం కదూ"

"ఆం - బేషక్! ఎవరికుండదు గనక?" ప్రశ్నార్థకంగా చూశాడు.

"అప్పుడప్పుడు కుటుంబానికి దూరంగా వెళ్ళవల్సి వస్తోంది కదూ! పాపం-"

"అవును. ఉద్యోగం అలాంటిది. తప్పనిసరిగా నా భార్య బిడ్డలకు దూరంగా గడపాల్సి వస్తుంది" - అతని గొంతులో మెత్తదనం చోటుచేసుకుంది.

"పరాయివాళ్ళు మీ ఇంట్లో జొరబడి, దోపిడి చేసి, నా వయసులో వున్న మీ కూతురు హసీనాను అనుభవిస్తే... మీకేమనిపిస్తుంది?"

"ఏయ్ - ఖామోష్" ఆవేశపూరితంగా అరిచి, దిగ్గున లేచాడు.

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు! నా కూతుర్ను చెడ్డ దృష్టితో చూసిన వాడి కళ్ళు పీకేస్తాను. కుటుంబ గౌరవం కోసం ప్రాణాలు పోయినా సరే పోరాడుతాను" - ఆమె అలాంటి ప్రశ్న వేస్తుందనుకోలేదు. కోపంగా క్రోధంగా చూశాడామె వైపు. ఆ ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పలేక అలసిపోయ్యాడు. బరువుగా శ్వాస వదిలాడు. ఆమె క్షమించమన్నట్లుగా చూసింది.

"మీరుంటే అలాగే చేస్తారు. నాకు ఆ నమ్మకం ఉంది. మీరు ఊళ్ళో లేనప్పుడు... ఒకవేళ... అలా జరిగితే-"

హుస్సేన్ ఆలోచనల్లో పడ్డాడు. ఆలోచిస్తున్న కొద్దీ తనపై తనకే కసి పెరుగుతోంది.

"మై మాఫీ మాంగ్‌తాహూ హుజూర్ - తప్పయిపోయింది. నాకు అవసరం లేని విషయాలు మాట్లాడాను. మీరు మీ పని ముగించుకుని వెళ్ళండి. కొద్దిసేపయితే మళ్ళీ పాప లేస్తుంది. మై తయ్యార్ హూం - అన్నట్టు మీ కూతురు హసీనా నా వయసుదే కదూ! ఆమె అందం నాకొస్తుందా గానీ... కొంచెం సేపు హసీనాయే అనుకోండి. ఆయియే సాబ్. ఆయియే. నేను మీ హసీనానే. మీ కోసం సిద్ధం-" తను నటిస్తున్నప్పుడు ముఖ కవళికలన్నీ మార్చి, గొంతు మార్చి ఎంతో ఉత్తేజంగా, ఎంతో వాస్తవంగా చెప్పే డైలాగుల్లా చెప్పింది - మహానటి శ్యామల. ఆమె తన వృత్తిలో సాధించిన పరిపూర్ణానుభవాన్ని అక్కడ ఉపయోగించింది.

అతడు అన్నీ విన్నాడు. మౌనాన్ని మింగాడు. మెదడు వేడెక్కింది. కర్కశత్వం, నీచత్వం ఆవిరైపోయాయి. ఒక వైపు క్రోధం, మరోవైపు అసహాయత...

"మీ ఆఫీసర్ను చూస్తారా?" నెమ్మదిగా అడిగింది శ్యామల. సోఫాలో అటు తిరిగి, తలవంచి ఆలోచిస్తున్న వాడల్లా ఆశ్చర్యపోయి "మా ఆఫీసర్ ఎవరూ?"

"మీరు ఎవరి అడుగుజాడల్లో నడుస్తున్నారో - అతను!!" హుస్సేన్‌ను స్వయంగా లేపి, తీసుకెళ్ళి పక్క రూంలో స్పృహలేకుండా వున్న ఖాసింను చూపింది.

"చచ్చిపోయాడా?" భయం. ఆశ్చర్యం. అతని గొంతులోని వణుకును, బలహీనతను పసిగట్టి, ఆమె ధైర్యంగా నిజం చెప్పింది.

"లేదు. షరాబ్‌లో మందు కలిపాను. మరో ఐదారు గంటలు లేవడు. ఈలోగా తెల్లవారుతుంది. ఒంటరిదాన్ని. నన్ను నేను రక్షించుకునే మార్గం మరొకటి తోచలేదు. లొంగినట్టే నటించాను. మత్తుమందిచ్చి మోసం చేశాను"

అతడు వింటున్నాడో లేదో గాని, దుఃఖాన్నంతా ముఖం మీద పరుచుకున్నాడు. చేతుల్తో కళ్ళు మూసుకుని అన్నాడు.

"కళ్ళు తెరుచుకున్నయ్!"

అక్కడే చాలాసేపు నిలబడ్డాడు. బేబి లేచిన చప్పుడు వినిపించి, శ్యామల పరిగెత్తింది. ఖాసింను ఆ స్థితిలో చూసి ఏవగించుకున్నాడు హుస్సేన్. అసలు వచ్చిందైతే ఖాసిం సాబ్ వెళ్ళిపోయి ఉంటాడనుకుని! కాని మత్తు మందుతో మోసగింపబడి, నిస్సహాయంగా స్పృహలేకుండా పడి ఉంటాడని ఊహించలేదు. పులిలాంటివాడు. ఒక చిన్న బలహీనతకు ఎలా చొళ్ళు కార్చుకుంటున్నాడూ??? ఒంటరిది గనుక, సులభంగా చేజిక్కించుకోవచ్చునుకున్నాడు. కాని ఆమె అలాంటిది కాదని, తెలివి గలదని తెలియగానే ఎందుకో హుస్సేన్‌కు సదభిప్రాయం కలిగింది. తల భారంగా అనిపించింది. చార్మినార్ సిగరెట్ వెలిగించాడు. మెల్లగా వెనక్కి కదిలాడు హుస్సేన్.

మధ్య హాల్లోకి నడిచేసరికి-

నటి శ్యామల, తన కూతురుకు పాలిస్తోంది. ఆ దృశ్యం కళ్ళారా చూడలేకపోయాడు. ఏదో వ్యథ గుండెను కెళ్ళగించింది.

అదే దృశ్యం - తల్లి పాలు కుడుపుతున్న దృశ్యం - ... కళ్ళు మూసుకున్నా కనిపిస్తోంది.

రాజూ, రాజ్యాధికారులూ తల్లిలాంటివారే. ప్రజల్ని రక్షించాలి. భక్షించగూడదు. ఎంత పాపం చెయ్యడానికి వచ్చాడు తనూ? తనను అల్లా క్షమించదు. తన ఈ నీచత్వానికి శిక్ష పడుతుంది!!

"మాఫ్ కర్‌దేనా బేటీ. పై నుంచి వచ్చిన హుకుం ప్రకారం దోపిడి, లూటీ, హత్యలు, మానభంగాలు చేస్తున్న మాకు, వివేచన లేకుండా పోయింది. మా మీది నుండి ఎప్పుడో కాలం కసిగా కాటేసి వెళుతుంది. అసలైతే ఇలాంటి వాటికి నేను చాలా దూరం. కాని తోటివారి సహచర్యం వల్ల... నాకేదో దుర్బుద్ధి పుట్టింది. నీ మీద ప్రయోగిద్దామని వచ్చాను..." చాలా చెబుతున్నాడు హుస్సేన్.

నటి శ్యామలకు తన నటనపై గొప్ప నమ్మకం కలుగుతోంది. అంతకు ముందు లక్షల మంది ప్రేక్షకులు పొగడితే కలిగిన సంతృప్తి కన్నా, ఇప్పటి సంతృప్తి ఆమెకు అనేకరెట్లు అధికం! నిజ జీవితంలో కూడా ఒక కొత్త పాత్రను ధైర్యంగా నిర్వహించి తనను, తన కూతురును రక్షించుకుంది. తన నటనకు సార్థకత చేకూరింది.

నిశ్శబ్దం బరువుగా ఘనీభవించింది - కొద్దిసేపు.

"అమ్మాయ్. పాపకు పాలివ్వడం అయ్యిందా?" - ఆమెకు ముఖం చూపలేక మరోవైపు తిరిగి అడిగాడు, హుస్సేన్-

"ఆం - అయిపోవచ్చింది"

"అయితే త్వరగా నడువ్. బయట జీప్ ఉంది. వీలయినంత త్వరగా నిన్ను సురక్షిత ప్రాంతానికి చేరుస్తాను. అట్లా చెయ్యడం నా ఉద్యోగ ధర్మం కాదు. కాని, అలా చేయమని నా మనసు చెప్తోంది. ఇక్కడ ఉంటే నీ జీవితం నీది కాదు. ఖాసిం సాబ్‌ను వెదుకుతూ కొద్దిసేపట్లో మా వాళ్ళంతా వస్తారు. నువ్విక్కడ ఉంటే-? ప్రాణాలతో బతకవు. జరగబోయే బీభత్సం కళ్ళలో మెదిలింది అతనికి.

"నువ్వు నీ పాపను తీసుకుని జీపు దగ్గరికొచ్చేయ్ - నేను ఖాసిం సాబ్‌ను మోసుకెళతాను. ఊం - త్వరగా - సమయం లేదు" - అంటూ హుస్సేన్, ఖాసింను భుజాల మీద వేసుకోవడానికి గదిలోకి వెళ్ళాడు.

ఆమె కళ్ళు ఆనందంతో నవ్వాయి-

తన భూమిక ముగిసినట్లనిపించింది.

తనలోని కళ, ఆత్మవిశ్వాసం - తననీ, తన పాపనీ, తన భర్త గౌరవాన్ని కాపాడాయి.

బయట - అధికారం అరుస్తోంది. అసహాయత ఏడుస్తోంది.

పెద్ద గోల - నిశ్శబ్దాన్ని రేప్ చేస్తున్నట్లు - ప్రపంచానికి చీకటి పాలు - ఇస్తోంది.

ఆమె తన పాపకు పాలివ్వడం పూర్తయ్యింది. ■

## నిర్వచనం

జీవితం కదిలే కల కాదు
రగిలే జ్వాల
ముసిరిన అమావాస్య కాదు
విరబూసే వెన్నెల -

నేటి ఒక్కొక్క కన్నీటి బొట్టు
ఒక్కొక్క నిట్టూర్పు
రేపటి భవిష్యత్తుకు
పునాది రాళ్ళు కూర్పు -

జీవితం నిత్య సచేతన ప్రయోగశాల
నిర్విరామ కర్మాగారం
క్షణం విశ్రమిస్తే
ఒక యుగం వెనుకబడిపోతాం

-డా॥ ఎస్వీ సత్యనారాయణ